సాక్షి మహబూబ్‌నగర్

గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



ఆకట్టుకున్న అష్టావధానం

జడ్చర్లలో బుధవారం నిర్వహించిన సాహిత్య అష్టావధానం కార్యక్రమం ఆహుతులను ఎంతో ఆకట్టుకుంది.

-8లో ▸



కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

జూరాల ఎగువ, దిగువ విద్యుత్ కేంద్రాల్లో బుధవారం ఉత్పత్తి కొనసాగిందని ఎస్ఈ శ్రీధర్ వివరించారు.

-8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.9 /22.6

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది. జల్లులు పడొచ్చు.

న్యూస్‌రీల్

యూరియా అక్రమంగా రవాణా చేస్తే కఠినచర్యలు



మహబూబ్‌నగర్ క్రైం: యూరియా విషయంలో రైతులకు ఇబ్బందులు కలిగించి అక్రమంగా రవాణా చేసినా, నిల్వ చేసినా అలాంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డి.జానకి హెచ్చరించారు. మహబూబ్‌నగర్ రూరల్ మండల పరిధిలోని మాచన్‌పల్లిలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన యూరియా స్టాక్ పాయింట్‌ను బుధవారం ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ తనిఖీ చేశారు. రైతులు నేరుగా అధికారులను సంప్రదించి తమ అవసరాలను తెలియజేయాలని, రైతులు ఎవరూ కూడా దళారులు, మధ్యవర్తులను నమ్మరాదని సూచించారు.

బీజేపీ బలోపేతానికి మరింత కృషి



పాలమూరు: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన తర్వాత బి.శాంతికుమార్ మొదటిసారి బుధవారం మహబూబ్‌నగర్ వచ్చిన క్రమంలో పార్టీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. మొదట జడ్చర్ల ఫ్లైఓవర్ దగ్గర ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి ర్యాలీగా బయల్దేరారు. పద్మావతి కాలనీలో చాకలి ఐలమ్మ, అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో బి.శాంతికుమార్‌ను పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ గజమాలలతో పాటు శాలువలు, ప్రత్యేక జ్ఞాపికలు అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తనకు కేటాయించిన పదవికి న్యాయం చేయడంతో పాటు జిల్లాలో పార్టీ బలోపేతం చేయడానికి కృషి చేస్తామనని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పడాకుల బాలరాజు, ఎగ్గని నర్సింహులు, సుదర్శన్‌రెడ్డి, మఠం మయూర్‌నాథ్, అయప్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో బుధవారం ఉత్సాహంగా సబ్‌జూనియర్ జిల్లాస్థాయి బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మఖ్సూద్‌బిన్ అహ్మద్‌జాకీర్ అడ్వకేట్, నసరుల్లా హైదర్ క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన హైదరాబాద్‌లోని కేవీబీఆర్ ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సెలక్షన్స్ ట్రయల్స్ జరుగుతాయని తెలిపారు. ఇందులో జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటి జాతీయస్థాయికి ఎంపికకావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సుబాన్‌జీ, మీర్ ఖాలెద్‌అలీ, ఎండి.ఇలియాజ్, కోచ్ షకీల్ తదితరులు పాల్గొన్నారు.

పీయూలో ఇంజినీరింగ్ తరగతులు ప్రారంభం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఇటీవల ప్రారంభించిన ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరంలో మూడు గ్రూప్‌లకు సంబంధించిన తరగతులు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ మేరకు మొదటి రోజు తరగతులకు వెళ్లిన వీసీ శ్రీనివాస్ విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరుకావాలని, యూనివర్సిటీలో ఉన్న లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, సమయం వృథా చేయకుండా చదువులపై దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాడు బీళ్లు.. నేడు సిరులు

ఉమ్మడి జిల్లాలో గణనీయంగా పెరిగిన సాగు విస్తీర్ణం

- పచ్చందాలను సంతరించుకున్న పాలమూరు
- 2014లో కేవలం 8.5 లక్షల ఎకరాల్లోనే సాగు..
- మూడేళ్లుగా అటూఇటు స్వల్పంగా మారుతున్న లెక్కలు
- ప్రస్తుతం అన్ని పంటలు కలిపి 18 లక్షల ఎకరాలకు పైగానే సాగు

పదేళ్ల క్రితం ఎటు చూసినా ఎండిన పంటలు.. బీళ్లుగా మారిన భూములు. ఫలితంగా ఉపాధి కోసం కుటుంబాలతో సహా తట్ట, బుట్ట, పార పట్టుకుని ముంబై, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు బస్సుల్లో కిక్కిరిసి వెళ్తున్న హృదయ విదారక దృశ్యాలు ఇప్పటికీ కళ్ల ముందు కదలాడుతుంటాయి. అలా వలసలకు కేరాఫ్‌గా నిలిచిన పాలమూరు జిల్లా హరితవనంగా మారింది. సాగునీరు లేక నెర్రెలు బారిన వ్యవసాయ భూముల్లో సిరుల పంట పండుతోంది. ఏటేటా సాగు గణనీయంగా పెరుగుతుండగా.. భూమికి పచ్చని రంగు వేసినట్లు కొత్త శోభను సంతరించుకుంది.

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్



నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సింగోటంలో సాగు చేసిన వరి పంట

జిల్లాల వారీగా సాగు వివరాలు (ఎకరాల్లో).. 2023-24

	మహబూబ్‌నగర్	నాగర్‌కర్నూల్	వనపర్తి	నారాయణపేట	జో.గద్వాల
పంటల సాగు	3,45,731	4,38,847	2,61,208	4,11,768	3,66,714
వరి	1,92,849	1,46,481	1,87,545	1,67,532	81,904
పత్తి	85,663	2,36,054	17,424	1,82,515	1,46,168
మొక్కజొన్న	28,263	48,204	11,111	103	13,135
2024-25 (వానాకాలం సాగు..)					
పంటల సాగు	3,48,783	4,36,242	2,41,618	4,11,442	3,73,868
వరి	1,94,983	1,57,376	1,96,200	1,71,527	89,698
పత్తి	82,482	2,20,582	14,721	1,53,014	1,33,205
మొక్కజొన్న	22,583	41,771	9,054	111	11,957
2025-26 (వానాకాలం సాగు..)					
పంటల సాగు	3,51,476	4,64,876	2,13,402	4,21,698	3,55,600
వరి	2,06,910	1,36,406	1,78,747	1,82,134	86,318
పత్తి	80,097	2,67,079	15,831	1,57,584	1,85,148
మొక్కజొన్న	36,909	52,272	9,085	105	11,337

మూడేళ్లుగా 18 లక్షల ఎకరాలపైనే

ఉమ్మడి పాలమూరు జిల్లాలో వానాకాలం సాగుకు సంబంధించి మొత్తంగా అన్ని పంటలు కలిపి 18 లక్షల ఎకరాలకు పైగా సాగయ్యాయి. మూడేళ్లుగా కొంత అటు ఇటుగా స్వల్పంగా లెక్కలు మారుతూ వస్తున్నాయి. 2023లో 18,24,268 ఎకరాలు కాగా.. 2024లో 18,11,953 ఎకరాల్లో పంటలు సాగైనట్లు అధికారిక రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది సాగు స్వల్పంగా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 18,07,052 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు. అదును దాటే సమయానికి అంటే వారం రోజుల్లో ఉమ్మడి జిల్లాలో మరో 50 వేల ఎకరాల్లో వరి నాట్లు పడే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

■ ఉమ్మడి జిల్లాలో రైతులు ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న సాగుచేస్తున్నారు. ఏటేటా వీటి సాగు గణనీయంగా పెరుగుతూ వస్తోంది. వరి 2023 ఖరీఫ్ సీజన్‌లో 7,76,311 ఎకరాలు, గతేడాదిలో 8,09,784 ఎకరాల్లో సాగు కాగా.. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 7,90,515 ఎకరాల్లో సాగైంది. మరో 50 వేల ఎకరాల్లో వరి సాగు కానుండగా.. 8.40 లక్షల ఎకరాలకు చేరుకోనుంది.

■ ఉమ్మడి పాలమూరులో 2023లో 6,67,824 ఎకరాల్లో, 2024లో 6,04,004 ఎకరాల్లో పత్తి సాగు కాగా.. ఈ ఏడాది 7,05,739 ఎకరాల్లో రైతులు తెల్ల బంగారం పంట వేశారు. గతేడాదితో పోలిస్తే 1,01,735 ఎకరాల్లో పత్తి సాగు పెరిగినట్లు తెలుస్తోంది.

■ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 2023 వానాకాలంలో 1,00,816 ఎకరాల్లో, 2024లో 85,476 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. ఈ ఏడాది ఇదే సీజన్‌లో 1,09,708 ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. గతేడాదితో పోలిస్తే 24,232 ఎకరాల్లో మొక్కజొన్న సాగు పెరిగినట్లు స్పష్టమవుతోంది.

■ గతేడాదితో పోలిస్తే నాగర్‌కర్నూల్ జిల్లాలో 28,634 ఎకరాల్లో పంటల సాగు పెరిగింది. మహబూబ్‌నగర్ జిల్లాలో 2,693 ఎకరాల్లో, నారాయణపేట జిల్లాలో 10,256 ఎకరాల్లో అధికంగా పంటలు సాగయ్యాయి. అదే వనపర్తిలో 28,216 ఎకరాల్లో, జోగుళాంబ గద్వాల జిల్లాలో 18,268 ఎకరాల్లో పంటల సాగు తగ్గినట్లు రికార్డులు చెబుతున్నాయి.

■ గతేడాదితో పోలిస్తే మహబూబ్‌నగర్ జిల్లాలో పత్తి సాగు స్వల్పంగా తగ్గింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో 40 వేలకు పైగా, గద్వాల జిల్లాలో 50 వేలకు పైగా ఎకరాల్లో అధికంగా రైతులు సాగు చేశారు. మొక్కజొన్నకు సంబంధించి మహబూబ్‌నగర్ జిల్లాలో గతేడాది కంటే 14 వేల ఎకరాల్లో, నాగర్‌కర్నూల్ జిల్లాలో 10 వేల ఎకరాల్లో అధికంగా సాగైంది.

10 లక్షల ఎకరాల్లో పెరిగిన సాగు విస్తీర్ణం..

ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా వానాకాలం సీజన్‌కు సంబంధించి 2014లో 8.50 లక్షల ఎకరాల్లో మాత్రమే వివిధ పంటలు సాగు కాగా.. ప్రస్తుతం 18.50 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు వేశారు. ఈ లెక్కన 11 ఏళ్లలో 10 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో సాగు నీటి వసతి ఇంకా పెరగాల్సి ఉన్నప్పటికీ.. విస్తారంగా వర్షాలు కురవడం, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి సాయం ఇస్తుండడం, రుణమాఫీ వంటి చర్యలు ఉమ్మడి జిల్లాలో సాగు గణనీయంగా పెరిగేందుకు దోహదపడ్డాయని వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

సాగు పెరిగింది.. పంట మార్పిడి చేయాలి



పంటల సాగు గణనీయంగా పెరిగింది. ఏటేటా వరి, పత్తినే అధికంగా పండిస్తున్నారు. ప్రతిసారి ఒకే రకమైన పంటలను సాగు చేయడం వల్ల భూమి చౌడు పొలంగా మారుతుంది. అన్ని రకాల పంటలు సాగు చేస్తేనే లాభదాయకంగా ఉంటుంది. జిల్లాలో గతేడాదితో పోలిస్తే ఈ సీజన్‌లో మొక్కజొన్న సాగు పెరిగింది. పంట మార్పిడి చేసి కందులు, జొన్న, ఆముదం, ఇతర పంటలు కూడా సాగు చేస్తే.. భూసారం దెబ్బ తినదు.

– బి.వెంకటేష్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, మహబూబ్‌నగర్

పిల్లల విషయంలో బాధ్యతగా ఉండాలి



పాలమూరు: బాలభవన్‌లో రక్షణ పొందుతున్న పిల్లల తల్లిదండ్రులు భిన్నమైన మానసిక స్థితిలో ఉన్నారని, వారందరూ మద్యానికి బానిసలుగా మారినట్లు గుర్తించామని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర అన్నారు. జిల్లాకేంద్రంలో ఉన్న బాలభవన్‌ను బుధవారం న్యాయమూర్తి సందర్శించి ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పిల్లల క్షేమం కోసం మద్యం అలవాటు ఉన్న తల్లిదండ్రులను వారిని డీ-అడిక్షన్ సెంటర్‌కు పంపిస్తామన్నారు.

■ జిల్లాకేంద్రంలోని శ్రద్ధ జూనియర్ కళాశాలలో బుధవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర హాజరై చట్టాలపై అవగాహన కల్పించారు. బాలల హక్కులు, చట్టాలు, బాల్య వివాహాలు, విద్య హక్కు చట్టం, పోక్సో చట్టం , బాలల సంరక్షణ, సైబర్ నేరాలు వంటి చట్టాలపై విద్యార్థులకు అవగాహన చేశారు. విద్యార్థులకు ఏదైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సైబర్ క్రైం ఎస్ఐ శ్రవణ్‌కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీళ్లు 36 గంటలు బంద్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఈ నెల 11వ తేదీన ఉదయం 8 గంటల నుంచి 12వ తేదీ రాత్రి 8 గంటల వరకు 36 గంటల పాటు మిషన్ భగీరథ నీళ్ల సరఫరా నిలిపివేస్తున్నట్లు భగీరథ గ్రిడ్ ఈఈ శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని క్రిష్టియన్‌పల్లి చించోళి జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 1200 ఎంఎం పైప్‌లైన్‌ను మార్చడంతో ఈ అంతరాయం ఏర్పడనున్నట్లు పేర్కొన్నారు. దీంతో మహబూబ్‌నగర్ నగరానికి పాక్షికంగా, మన్యంకొండ నీటిశుద్ధీకరణ ప్లాంట్ నుంచి సరఫరా అయ్యే మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లోని 258 గ్రామాలతో పాటు నారాయణపేట, మక్తల్, దేవరకద్ర మున్సిపాలిటీలకు పూర్తిగా నీళ్ల సరఫరా నిలిచిపోనున్నట్లు తెలిపారు.

ప్రజాస్వామిక పోరాటాలకు ఐలమ్మ స్ఫూర్తి



ఐలమ్మ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ విజయేందిర, అధికారులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): 'భూమి కోసం భుక్తి కోసం నా పోరాటం' అని చాటిచెప్పిన వీరవనిత చాకలి ఐలమ్మ అని జిల్లా కలెక్టర్ విజయేందిర అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం జిల్లాకేంద్రంలోని పద్మావతి కాలనీలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాటి తెలంగా సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, ప్రజాస్వామిక పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. ఐలమ్మ ఏ ఒక్క కులం కోసమో, వర్గం కోసమో పోరాటం చేయలేదని, పీడిత, పేద వర్గాల కోసం కొట్లాడిన ధీర వనిత అని కొనియాడారు. ఆనాటి దొరల అరాచకాలను ఎదురించి కొట్లాడిన మహా నాయకురాలని చెప్పారు. చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. తెలంగాణ మట్టిలోనే పోరాటతత్వముందని చెప్పడానికి ఐలమ్మ జీవితమే నిదర్శనమని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, బీసీ సంక్షేమాధికారి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం వాయిదా

- సిండికేట్ అవుతున్న టెండర్ దారులు
- ఇప్పటికే మూడుసార్లు వాయిదా



చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం కురుమూర్తిస్వామి ఆలయం వద్ద బుధవారం కొబ్బరికాయలు, పూలు, పూలదండలు, పూజ సామగ్రి, వాహనపూజ సామగ్రికి నిర్వహించిన బహిరంగ వేలం మళ్లీ వాయిదా పడింది. వేలంలో టార్గెట్ రానందున అధికారులు వాయిదా వేశారు. వేలం పాటలు ఇప్పటికే మూడుసార్లు వాయిదా పడ్డాయి. మార్కెట్‌లో కొబ్బరి కాయల రేట్లు పెరిగినందున ఆలయ సిబ్బంది నిర్ణయించిన రేటుకు గిట్టుబాటు కాదన్న ఉద్దేశంతో పాట దారులు సిండికేట్ అవుతున్నారన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత సంవత్సరం టెంకాయ రూ.25కు విక్రయించగా ఈ సంవత్సరం రూ.30కు విక్రయించేందుకు అధికారులు ధర నిర్ణయించారు. అయినప్పటికీ గిట్టుబాటు కాదని టెండర్ దారులు వేలంలో పాల్గొంటూనే హెచ్చు పాట పాడకుండ అడ్డు వేస్తున్నారు. దీంతో అధికారులు వాయిదాలు వేస్తూ వస్తున్నారు. ఇట్టి విషయంపై ఈఓ మదనేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా.. కొబ్బరి కాయల విక్రయాల ధర గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం రూ.5 పెంచామన్నారు. కానీ టెంటర్ దారులు రూ.35 కావాలని కోరుతున్నట్లు సమాచారం ఉందన్నారు. ఉన్నతాధికారులు నిర్ణయం మేరకు త్వరలో వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, కమిటీ సభ్యులు భారతి, నాగరాజు, కమలాకర్, భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ఎంప్లాయిస్ ఫోరం జిల్లా అధ్యక్షుడు రాజసింహుడు ఆధ్వర్యంలో జరిగిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర సాధనలో ఆర్టీసీ కార్మికులది ప్రధానమైన పాత్ర అన్నారు. ప్రగతి రథ చక్రాలను ఆపేసిన ఆర్టీసీ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు మొండిచెయ్యి దక్కిందన్నారు. ఇది ఎవరు కాదన్నా.. నిజాయితీగా మాట్లాడుతానన్నారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేసుకోవాలని, తనవంతుగా రూ.5 లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. టీజీఎంఎఫ్‌సీ చైర్మన్, ఫోరం గౌరవాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ.. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, నాయకులు ఎన్పీ వెంకటేశ్, సిరాజ్‌ఖాద్రీ, గోపాల్‌యాదవ్, సీజే బెనహర్, రాములుయాదవ్, అజ్మత్‌అలీ, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ఫోరంనాయకులు సుధాకర్, ఎంవీ.కృష్ణ, నాగేశ్వర్‌రావు, దేవదాస్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే యెన్నం, చైర్మన్ కొత్వాల్‌కు వినతి పత్రాలు అందజేస్తున్న ఫోరం ప్రతినిధులు

అభ్యంతరాలు రాకపోవడంతో..

- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల తుది ఓటరు జాబితా విడుదల
- జిల్లాలో 4,99,582 మంది ఓటర్లు



తుది జాబితాను విడుదల చేస్తున్న జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీహరి, అధికారులు


జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు జిల్లాలో ఓటర్ల సంఖ్య తేలిపోయింది. బుధవారం జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. దీని ప్రకారం జిల్లాలో 4,99,852 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 2,48,222 మంది, మహిళలు 2,51,349 మంది ఉండగా 11 మంది ఇతరులు ఉన్నారు. పురుషుల కంటే 3,127 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు.

■ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ లిస్టుతో పాటు పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని ఈనెల 6వ తేదీన ముసాయిదా నోటిఫికేషన్‌ను అధికారులు విడుదల చేశారు. ఈ నెల 8వ తేదీన జిల్లా, మండలస్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించారు. అలాగే 8వ తేదీ వరకు అభ్యంతరాలుంటే రాత పూర్వకంగా దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించారు. ఎలాంటి అభ్యంతరాలు లేకపోవడంతో ముసాయిదా జాబితానే తుది జాబితాగా విడుదల చేశారు. 'ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో ముఖ్యమైనది ఓటరు, పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ప్రకటించాం. ఎన్నికల సంఘం ఎప్పుడు ఆదేశాలు ఇచ్చినా సిద్ధంగా ఉన్నారు. ఇందుకోసం అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేశాం.' అని జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

మండలం	పురుషులు	మహిళలు	పోలింగ్ కేంద్రాలు
అడ్డాకుల	12,081	12,289	43
బాలానగర్	16,898	16,538	65
భూత్పూర్	13,473	13,607	49
చిన్నచింతకుంట	14,995	16,061	54
దేవరకద్ర	12,921	13,317	44
గండేడ్	16,023	16,221	59
హన్వాడ	20,095	20,296	71
జడ్చర్ల	20,081	20,779	77
కోయిల్‌కొండ	26,138	26,035	92
కౌకుంట్ల	8,400	8,587	34
మ.నగర్ రూరల్	17,231	17,574	67
మిడ్జిల్	12,426	12,702	49
మహమ్మదాబాద్	15,645	15,644	61
మూసాపేట	10,770	10,779	41
నవాబ్‌పేట	20,221	19,972	84
రాజాపూర్	10,824	10,948	40

మళ్లీ చిరుత కలకలం

- కోస్గిరోడ్డులోని టీడీగుట్ట గుండుపై సంచారం
- చిరుతను బంధించేందుకు రెండు బోన్లు ఏర్పాటు



టీడీగుట్ట గుండుపై పడుకొని ఉన్న చిరుత

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఇటీవల మహబూబ్‌నగర్ పట్టణ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న చిరుత బుధవారం సాయంత్రం మళ్లీ కనిపించింది. తిర్మల్‌దేవుని గుట్టపై కోస్గిరోడ్ సమీపంలోని గుండు మీద చిరుత సంచరిస్తూ కనిపించడం కలకలం రేపింది. గుండుపై చిరుత సంచరిస్తూ కనిపించిన వీడియోలు వైరల్ కావడంతో స్థానికుల సమాచారం మేరకు చిరుత సంచరిస్తున్న స్థలానికి చేరుకున్న మున్సిపల్, అటవీశాఖ అధికారులు డ్రోన్ కెమెరాలో చిత్రీకరిస్తూ అది వెళ్లేదారిని గమనించారు. అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ అబ్దుల్‌హాయ్ ఆధ్వర్యంలో అటవీశాఖ, మున్సిపల్ సిబ్బంది చిరుతను బంధించేందుకు వెంటనే రెండు బోన్‌లు ఏర్పాటు చేశారు. కాగా చిరుత సంచారంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. చిరుతను చూసేందుకు ప్రజలు, వాహనాలపై వెళ్తున్న వారు గుమిగూడడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, సభ్యులు సుధీర్‌రెడ్డి, కాత్యాయని, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, కలెక్టర్ విజయేందిర

స్థానిక సంస్థలు స్వయం సమృద్ధి సాధించాలి

- అనవసర వ్యయాన్ని తగ్గించుకోవాలి
- సొంత ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించాలి
- రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

– జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్)

- వివరాలు 8లో..

క్లుప్తంగా

డీసీసీబీ అక్రమాలపై విచారణ చేపట్టాలి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: డీసీసీబీలో అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల్‌నర్సింహ డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ చౌరస్తాలో సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అధికారులు ఇష్టారాజ్యంగా కాంపౌండ్‌వాల్‌కు అడ్వాన్స్‌గా రూ.16 లక్షలు, నామినేషన్ పద్ధతిలో రూ.39 లక్షలు టెండర్ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జడ్చర్ల, కొడంగల్ బ్యాంకులపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రాము, సురేశ్, పద్మావతి, అల్వాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

మహబూబ్‌నగర్ రూరల్: భారత రాజ్యాంగాన్ని మనువాదుల నుంచి రక్షించుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. బుధవారం షాసాబ్‌గుట్ట ఎస్సీ కళాశాల హాస్టల్ (ఏ)లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు మాణిక్యం అధ్యక్షతన రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వక్తగా హాజరైన మాట్లాడారు. రాజ్యాంగం ఏర్పడి 75 ఏళ్లు గడిచినప్పటికీ ఆ ఫలాలు సంపన్నులకే చెందుతున్నాయని, సామాన్యులకు దక్కడం లేదన్నారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కుర్మయ్య, పట్టణ కార్యదర్శి ఆదివిష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసం: రూ.90వేలు మాయం

మహబూబ్‌నగర్ క్రైం: 'అత్తమ్మ నాకు అత్యవసరంగా డబ్బులు అవసరం ఉన్నాయి' అని అల్లుడి పేరుతో ఇన్‌స్టాగామ్‌లో వచ్చిన మేసేజ్‌కు స్పందించిన ఓ మహిళ డబ్బులు నష్టపోయింది. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రాజేంద్రనగర్‌కు చెందిన జ్యోతి ఇటీవల ఇన్‌స్టాగామ్‌లో ఆమె అల్లుడి పేరుతో మేసేజ్‌లు పంపి అత్యవసరంగా డబ్బులు కావాలని చెప్పింది. దీంతో ఇన్‌స్టాలో పెట్టిన అకౌంట్లకు డబ్బులు పంపాలని చెప్పడంతో రూ.90వేలు పంపడం జరిగింది. ఆ తర్వాత వచ్చిన అల్లుడిని ఆమె డబ్బులు పంపిన కదా అడిగింది. ఎప్పుడు అడిగినా నాకు పంపలేదని చెప్పడంతో మోసపోయినట్లు గ్రహించి ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజాపూర్(బాలానగర్): పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేయగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బాలానగర్ మండలంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. వీరన్నపల్లి గ్రామానికి చెందిన తెలుగు ఎల్లయ్య(57) భార్య పద్మమ్మ 4 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. భార్య మృతితో నాలుగు ఏళ్ల మనోవేదన వల్ల కుటుంబ సభ్యులతో బాధపడుతూ ఉండేవాడు. మంగళవారం ఉదయం తన పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. చుట్టుపక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. అతని కుమారుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు బాలానగర్ ఎస్ఐ లెనిన్‌గౌడ్ తెలిపారు.

స్వయం సమృద్ధి సాధించాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

- స్థానిక సంస్థలు సొంత ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించాలి
- రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): స్థానికంగా ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ ఆదాయ వనరులను పెంపొందించుకునే దిశగా వినూత్న ఆలోచనలు, పద్ధతులతో స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో పని చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులతో పాటు అనవసర వ్యయాన్ని తగ్గించుకొని ఆదాయ వనరుల రాబడిని పెంచుకున్నప్పుడే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. బుధవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల అధికారులతో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులు రమేష్, సంకిపల్లి సుధీర్‌రెడ్డితో కలిసి చైర్మన్ సమీక్ష నిర్వహించారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల కలెక్టర్లు విజయేందిర బోయి, బదావత్ సంతోష్, ఆదర్శ్ సురభి, బీఎం సంతోష్, నారాయణపేట అదనపు కలెక్టర్ రెవెన్యూ జిల్లాల వారీగా స్థానిక సంస్థల పనితీరును చైర్మన్‌కు వివరించారు. మున్సిపాల్టీలు, గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధిదీపాలు, తడి, పొడి చెత్త సేకరణ, పచ్చదనం పెంపు, పన్ను వసూళ్లు, స్వయం ఉపాధి పథకాల అమలు, ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు కొనసాగుతున్న కార్యక్రమాలు, గ్రాంట్స్ రూపంలో సమకూరుతున్న ఆదాయం, ఇతర మార్గాల ద్వారా స్థానిక సంస్థలకు అందుతున్న ఆదాయం తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా విడుదలైన నిధులు, వాటి ఖర్చు వివరాలను గణాంకాల ద్వారా వెల్లడించారు. ఈ సందర్భంగా చైర్మన్ సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మొదటగా రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక సంస్థలు ప్రజలకు సమర్థవంతంగా వసతులు, సేవలు అందించాలని.. ఇందుకు అధికారులు అంకితభావంతో పని చేయాలని కోరారు. తడి, పొడి చెత్త నిర్వహణ అవలంబించి మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థను ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో అవలంబిస్తున్న ఉత్తమ పద్ధతులను కమిషన్ అధ్యయనం చేస్తోందని తెలిపారు. గ్రామపంచాయతీలు తడి, పొడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారుచేసి మహిళా సంఘాల ద్వారా విక్రయించవచ్చని, తద్వారా ఆదాయంతో పాటు భూ సారం పెరుగుతుందని వివరించారు. మూడు, నాలుగు పంచాయతీలు కలిసి క్లస్టర్‌గా ఏర్పాటు చేసుకొని చికెన్ వ్యర్థాలకు టెండర్ వేసి వచ్చిన ఆదాయాన్ని జనాభా ప్రాతిపదికన పంచుకోవచ్చని సూచించారు. కొత్త గ్రామపంచాయతీలుగా మారిన తండాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీధి దీపాలకు సోలార్ విద్యుత్‌ను వినియోగిస్తే విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందని.. ప్రయోగాత్మకంగా చిన్న గ్రామపంచాయతీల్లో అమలు చేస్తూ క్రమంగా అన్ని స్థానిక సంస్థలకు విస్తరించాలని తెలిపారు. పన్ను వసూళ్లు, ప్రకటనలపై వచ్చే రాబడి, వృత్తి పన్ను, వ్యాపార వాణిజ్య సముదాయాలు, ఇతర నిర్మాణాలకు సంబంధించి నిర్ణీత రుసుం వసూలు చేస్తూ ఆర్థిక పరిపుష్టి సాధించాలన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ పురాతనమైంది..



పంచాయతీ రాజ్ వ్యవస్థ పురాతనమైందని.. రాజీవ్‌గాంధీ 73, 74 రాజ్యాంగ సవరణలతో అధికారాలు బదలాయించి వికేంద్రీకరించారని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి తెలిపారు. గ్రామపంచాయతీ, మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్ మూడంచెల వ్యవస్థ ఏర్పాటు చేశారని.. గ్రామపంచాయతీలకు కేంద్రం నుంచి నేరుగా నిధులు వస్తున్నాయన్నారు. గ్రామానికి ఒక మాస్టర్ ప్లాన్ తయారుచేసుకొని ప్రాధాన్యత ప్రకారం పనులు పూర్తిచేస్తే అభివృద్ధి చెందుతాయని సూచించారు.

భవనాలు, సిబ్బంది లేరు..



పదేళ్లలో కొత్త మండలాలు, గ్రామాలు ఏర్పాటయ్యాయని.. చాలాచోట్ల భవనాలు, సిబ్బంది లేరని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తెలిపారు. సీనరేజ్, స్టాంపు డ్యూటీ స్థానిక సంస్థలకు రావడం లేదని, గ్రామపంచాయతీలకు నిధులు కేటాయించాలని కోరారు. అనంతరం కమిషన్ సభ్యుడు సంకిపల్లి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో పని చేస్తున్న అనుభవం ఉన్న అధికారులు ఆదాయ వనరుల పెంపునకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు, కార్యదర్శి కాత్యాయని, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, దేవ సహాయం, యాదయ్య, నర్సింగ్‌రావు, ఉమ్మడి జిల్లా జెడ్పీ సీఈఓలు వెంకట్‌రెడ్డి, యాదయ్య, డివిజనల్ పంచాయతీ అధికారులు, పుర కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆత్మహత్య ప్రేరకాలను గుర్తించడం అవసరం



నాటకం ద్వారా ఆత్మహత్య నివారణపై అవగాహన కల్పిస్తున్న ఎంబీబీఎస్ విద్యార్థులు

సీనియర్ మానసిక వైద్యనిపుణుడు అశోక్‌రెడ్డి

పాలమూరు: చిన్నచిన్న ప్రవర్తన మార్పులే వ్యక్తి మనోవేదనను సూచించవచ్చని, ఆత్మహత్య ప్రవర్తనకు దారితీసే ప్రారంభ సంకేతాలు, ప్రేరకాలను గుర్తించడం చాలా అత్యవసరం అని ఎస్‌వీఎస్ ఆస్పత్రి మానసిక వైద్య విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ అశోక్‌రెడ్డి అన్నారు. ఎంతో ఒత్తిడిని ఎదుర్కొనే తర్వాతే ప్రాణం తీసుకోవాలనే ఆలోచన కల్గుతుందని, ఆత్మహత్యలను నివారించవచ్చని, మానసిక సమస్యలను గుర్తించి వాటికి సరిపడ వైద్య కౌన్సిలింగ్ తీసుకోవాలన్నారు. ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఎస్‌వీఎస్ మానసిక విభాగం ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణపై ప్రత్యేక నాటక కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. మానసిక సమస్యలు ఎదుర్కొంటున్న వ్యక్తులు సాయం కోరే విధంగా భయపడకుండా ముందుకు రావడానికి సహాయక వాతావరణం సృష్టించాలన్నారు. ఆ తర్వాత మానసిక ఆరోగ్యంపై ఎంబీబీఎస్ విద్యార్థులు ప్రత్యేక నాటకం ద్వారా ఒత్తిడి, ఆందోళన ఎదుర్కొనే వ్యక్తులు ఎలా ఉంటారో ప్రదర్శించి చూపించారు. ఎస్‌వీఎస్ నర్సింగ్ విద్యార్థులు మైమ్ ప్రదర్శనలో ఆత్మహత్య ముప్పులో ఉన్న వ్యక్తుల మానవేదనను ప్రతిబింబించే విధంగా ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ రెసిడెంట్ డైరెక్టర్ రాంరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ జోషి, డాక్టర్ హరిప్రసాద్, వెంకట్ రాహుల్, భార్గవ్ స్వరాజ్, వినీల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

➪ ఆర్థిక ఇబ్బందులు, ఇతర సమస్యలను ఒంటరిగా మోయరాదని, ఒత్తిడిని ఇంట్లో ఉండే కుటుంబ సభ్యులు లేదా స్నేహితుల దగ్గర పంచుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానంగా యువత చదువు, భవిష్యత్‌పై సోషల్ మీడియా ఒత్తిడి ఎక్కువగా పెరిగిందని పిల్లలతో పెద్దలు తరచూ మాట్లాడాలన్నారు. ఒత్తిడిలో ఉన్న వారి కోసం పోలీస్ శాఖ ప్రధానంగా హెల్ప్‌లైన్ నంబర్లు, కౌన్సిలింగ్ సౌకర్యం అందుబాటులో పెట్టడం జరిగిందన్నారు.

ఉమ్మడి జిల్లా మార్కెట్ కమిటీల అధ్యక్షురాలిగా బెక్కరి అనిత

మహబూబ్‌నగర్ రూరల్: ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల ఉమ్మడి జిల్లా కమిటీ అధ్యక్షురాలిగా మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత నియమితులయ్యారు. రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదేశానుసారం ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు అనిత నివాసంలో సమావేశమయ్యారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బెక్కరి అనిత, గౌరవ అధ్యక్షుడిగా శివారెడ్డి, ఉపాధ్యక్షుడిగా హన్మంతు, ప్రధాన కార్యదర్శిగా రమణారావు, కోశాధికారిగా హరిలింగం, కార్యదర్శిగా రహమతుల్లా, కార్యవర్గ సభ్యురాలుగా రజితలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, పీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, నాయకులు వేణుకుమార్‌రెడ్డి, బెక్కరి మధుసూదన్‌రెడ్డి, రాజు, చెన్నయ్య, శ్రీనివాస్, రాఘవేందర్ పాల్గొన్నారు.



ఆకట్టుకున్న సాహిత్య అష్టావధానం



అవధానం నిర్వహిస్తున్న వరంగల్ శ్రీరామ్, పృచ్ఛకులు (సాహితీవేత్తలు)

జడ్చర్ల టౌన్: కుతుబ్‌షాహి, అసఫ్‌జాహీల పరిపాలనలో దాదాపు 600 ఏళ్లు తెలుగు భాష నిరాధారణకు గురైనప్పటికీ తన ఔన్నత్యాన్ని కాపాడుకుందని అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని చంద్రగార్డెన్‌లో ఆత్మీయ మిత్రమండలి ఆధ్వర్యంలో బి.శివకుమార్ నిర్వహించిన సాహిత్య అష్టావధాని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వళన చేసి ప్రారంభించారు. వరంగల్ శ్రీరామ్ అవధానిగా, సంధానకర్తగా కంది శంకరయ్య వ్యవహరించగా 8 మంది సాహితీవేత్తలు పృచ్ఛకులుగా ప్రశ్నలు సంధించారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 8, 9, 10వ వతరగతి విద్యార్థులు హజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాస్యత లేని రోజుల్లోనూ తెలుగు భాష మనుగడ సాధించినా.. సంపూర్ణ అక్షరాస్యత సాధిస్తున్న ప్రస్తుతం సమాజంలో ఇంగ్లిష్ చదువుల వల్ల తెలుగు మాట్లాడే వారి సంఖ్య తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలో ఏడు వేల భాషలుండగా తెలుగు 11వ స్థానంలో ఉందని, భారతదేశంలో గతంలో రెండో స్థానంలో ఉండగా నేడు 4వ స్థానానికి పడిపోయిందన్నారు.

అష్టావధానం ఇలా..

అష్టావధానంలో మొదట నిషిద్ధాక్షరి అనే విభాగంలో కుంచకూరి బుచ్చిలింగం నిర్వహిస్తూ ఇప్పటి యువతకు ఆంజనేయుడు ఆదర్శం అనే అంశంపై పద్యం చెప్పమని కోరారు.

➪ సమస్యాపూరాణం అనే రెండవ విభాగంలో.. చక్రవర్తుల రమణాచార్యులు నిర్వహిస్తూ హరిణము సమరమ్మునందు హస్తిని గూల్చెన్ (యుద్ధంలో జింక ఏనుగును చంపెన్) అనే సమస్యను ఇచ్చారు. కోరికయే ఏనుగుని మనసే జింక అని అవధాని సమస్యను పూరించారు.

➪ దత్తపది అనే విభాగంలో దార్ల రాఘవేంద్రచారి నిర్వహిస్తూ కల్లు, రమ్ము, బీరు, సారా అనే పదాలతో గణేషుడిని పూజించాలని చెప్పారు.

➪ న్యస్తాక్షరి అనే విభాగంలో యలకంటి భాస్కర్ నిర్వహిస్తూ య, ల, కం, టి అనే నాలుగు అక్షరాలు నాలుగు పాదాల్లో ఎక్కడెక్కడ రావాలో పేర్కొంటూ ప్రపంచ దేశాల్లో భారత ప్రధాని మోదీకి దక్కుతున్న గౌరవం గూర్చి శార్దూల వృత్తంలో చెప్పమన్నారు.

➪ వర్ణన అనే విభాగంలో కిరణ్మయి నిర్వహిస్తూ సభాధ్యక్షులు శివకుమార్‌ను శ్రీకృష్ణదేవరాయలుగా, పృచ్ఛకులను అష్టదిగ్గజాలుగా వర్ణించమన్నారు.

➪ ఆశువు అనే విభాగాన్ని మరింగంటి కృష్ణవేణి నిర్వహిస్తూ ప్రస్తుతం విద్యార్థులు ఎక్కువ సమయం సెల్‌ఫోన్‌లోనే గడుపుతున్నారని దాని దుష్ఫలితాల గూర్చి అప్పటికపుడు పద్యం చెప్పమన్నారు. అవధాని ఆశువుగా పద్యాన్ని చెప్పారు.

➪ ఛందోభాషణం అనే విభాగంలో పూదత్తు కృష్ణమోహన్ పద్యరూపంలో అవధానితో మాట్లాడారు. అప్రస్తుత ప్రసంగం అనే విభాగాన్ని సాకేత్‌ప్రవీణ్ నిర్వహించారు.

మిడ్జిల్ స్కూల్ హెచ్‌ఎంకు నోటీసులు

- ఒకేరోజు 8 మంది ఉపాధ్యాయుల గైర్హాజరుపై విచారణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలోని మిడ్జిల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో గత శనివారం ఒకేరోజు 8 మంది ఉపాధ్యాయుల గైర్హాజరుపై జిల్లా విద్యాశాఖ అధికారులు విస్మయానికి గురయ్యారు. ఆరుగురు ఉపాధ్యాయులు హెచ్‌ఎం అనుమతితో వెళ్లగా మరో ఇద్దరు అనుమతి లేకుండా విధులకు హాజరు కాలేదని తెలుస్తోంది. ఈ విషయంపై మిడ్జిల్ ఎంఈఓ వెంకటయ్యను విచారణ చేయాలని డీఈఓ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం విచారణ చేపట్టారు. రిపోర్టును డీఈఓ కార్యాలయానికి పంపించారు. సంఘటనపై పూర్తిస్థాయిలో వివరణ ఇవ్వాలని మిడ్జిల్ స్కూల్ హెచ్‌ఎంకు డీఈఓ నోటీసులు ఇచ్చారు. ఈ విషయంపై బుధవారం డీఈఓ ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఒకేరోజు అనుమతి లేకుండా ఉపాధ్యాయులు వెళ్లడంపై ఎంఈఓ విచారణ అనంతరం హెచ్‌ఎంకు నోటీసులు ఇచ్చామన్నారు. వివరణ ఇచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఫేషియల్ రికగ్నిజేషన్ విధానంలో అటెండెన్స్ వేస్తున్నప్పటికీ ఇటువంటి ఘటనలు జరగడంపై అధికారుల పర్యావేక్షణపై అనుమానాలకు తావిస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు చర్చించుకుంటున్నారు.

సమతుల్య ఆహారం అందించాలి

దేవరకద్ర: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సమతుల్య ఆహారం అందించాలని డీడబ్ల్యూఓ జరినాబేగం సూచించారు. బుధవారం దేవరకద్ర మార్కెట్ యార్డులో అడ్డాకుల, మూసాపేట, భూత్పూర్, దేవరకద్ర, చిన్నచింతకుంట, కౌకుంట్ల మండలాలకు సంబంధించి అంగన్‌వాడీ టీచర్లతో ప్రాజెక్టు సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని, కేంద్రాలకు వచ్చే గుడ్లు, పాలు, బియ్యం, నూనె వస్తువులు సరిచూసుకోవాలన్నారు. ఫేస్ కాప్చరింగ్ చేసిన తర్వాతనే గుడ్లు, పాలు ఇవ్వాలని పేర్కొన్నారు. పిల్లల బరువుతో పాటు ఫేస్ కాప్చరింగ్ ప్రతినెల 5వ తేదీలోగా తీయాలన్నారు. సమావేశంలో డీసీ నరేందర్, ఇంచార్జీ డీపీఓ కమాలాదేవి, సూపర్‌వైజర్లు గీత కుమారి, రజిత, సుశీల, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ జరినాబేగం

మార్కెట్‌లోకి హోండా సీబీ 125 హార్నెట్



నూతన బైకలను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న ఆర్టీఓ రఘుకుమార్, నర్మద హోండా ఎండీ వేణుగోపాల్‌సింగ్

పాలమూరు: హోండా కంపెనీ నుంచి మార్కెట్‌లోకి మరో రెండు నూతన మోడల్ ద్విచక్ర వాహనాలను విడుదల చేశారు. జిల్లా కేంద్రంలోని నర్మదా హోం షోరూంలో బుధవారం హోండా సీబీ 125 హర్నెట్, హోండా షైనీ 100డీఎక్స్ ద్విచక్ర వాహనాలను ఆర్టీఓ రఘుకుమార్, నర్మద హోండా ఎండీ వేణుగోపాల్‌సింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్పోర్ట్స్ బైక్ ప్రేమికుల కోసం హోండా సీబీ 125 హర్నెట్ అద్భుతంగా ఉంటుందని, ఐదు గేర్లు, సైలెంట్ స్టార్ట్ ఏసీజీ, 4.2అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లే, బ్లూటూత్ కనెక్టివిటీ, కాల్, ఎస్‌ఎంఎస్ అలర్ట్స్, నావిగేషన్ సదుపాయం ఉందన్నారు. యూఎస్‌బీ ఛార్జింగ్, ఎల్ఈడీ హెడ్‌లైట్లు ఇన్‌బిల్ట్‌గా వస్తాయన్నారు. షోరూం ధర రూ.1.12లక్షలు ఉండగా ఆన్‌రోడ్ ధర రూ.1,36,495లకు లభిస్తుందన్నారు. ఇక హోండా షైనీ 100డీఎక్స్ ఫ్యామిలీ వినియోగదారులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ మైలేజ్ ఇస్తూ చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. 65 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తోందని, 4 స్ట్రోక్ ఇంజిన్, 4 స్పీడ్ గేర్ బాక్స్, ఓబీడీ-2బీ కంప్లెంట్, డిజిటల్ క్లస్టర్, సైడ్ స్టాండ్ ఇంజిన్‌కట్ ఆఫ్ ఉంటుందన్నారు. షోరూం ధర రూ.75,950 ఉండగా ఆన్‌రోడ్ ధర రూ.92,172లకు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మేనేజర్ బాలీశ్వర్‌రెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గ్రాట్యూటీ చెక్కు అందజేత

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు వెంకటేశ్వరచార్యులు ఇటీవల మృతి చెందాడు. దేవదాయశాఖ నుంచి రూ.2లక్షల గ్రాట్యూటీతోపాటు ఆయన కుమారుడు నరసింహాచార్యులును ఆలయ అర్చకుడిగా నియమించింది. బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మధనేశ్వర్‌రెడ్డి అర్చకుడి కుటుంబ సభ్యులకు గ్రాట్యూటీ చెక్కు, నియమాంకపత్రం అందజేశారు.

మోటార్ సైకిళ్ల దొంగల అరెస్ట్



అమరవాయిలో పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

మల్దకల్: కొంతకాలంగా గద్వాల, జడ్చర్ల, వనపర్తి, పెబ్బేరు, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో అపహరణకు గురైన మోటార్ సైకిళ్లను జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని అమరవాయిలో బుధవారం కర్నూల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అమరవాయిలో 25 బైక్‌లను పోలీసులకు పట్టుబడడంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. వివరాలు ఇలా.. గద్వాల పట్టణానికి చెందిన జశ్వంత్ వారం రోజుల క్రితం కర్నూలు పట్టణంలో మోటార్ సైకిల్‌ను దొంగలించడంతో కర్నూలులోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో సీఐ నాగరాజురావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం మోటారుసైకిల్ చోరీపై విచారణ చేపట్టి గద్వాల పట్టణానికి చెందిన జశ్వంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విచారించగా 30కు పైగా బైక్‌లు చోరీ చేసినట్లు అంగీకరించాడు. దీంతో సీఐతో పాటు పోలీసు సిబ్బంది మహేందర్, రవి, శ్రీను అమరవాయికి చేరుకొని జశ్వంత్‌కు సహకరించిన బోయ వీరేష్, పాండు, బోయ పాండులను అదుపులోకి తీసుకున్నారు. వారి విచారణలో జశ్వంత్ చోరీ చేసిన బైక్‌లను గ్రామంలోని కొంతమంది రైతులు, వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించి వచ్చిన డబ్బులతో జల్సాలు చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. దొంగలించిన బైక్‌లను కొన్న యజమానులకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించడంతో వారు బైక్‌లను పోలీసులకు అప్పగించారు. అమరవాయిలో 18, బిజ్వారంలో 2, సద్దలోనిపల్లి, అయిజ, మల్దకల్ తదితర గ్రామాల్లో 25 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన వాటిని త్వరలోనే స్వాధీనం చేసుకుంటామన్నారు. తక్కువ ధరకు వచ్చే వాహనాలను ఎవరూ కొనుగోలు చేయొద్దని ప్రజలకు సూచించారు. వాహనాలు కొనుగోలు చేసే సమయంలో అమ్మే వారి నుంచి ఆధార్, ఆర్‌సీ, లైసెన్సులు తప్పనిసరిగా పరిశీలించాలన్నారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ధరూరు/ఆత్మకూరు/దోమలపెంట/రాజోళి: జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో బుధవారం ఉత్పత్తి కొనసాగిందని ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ 6 యూనిట్ల నుంచి 234 మెగావాట్లు, 307.048 మి.యూ., దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 333.081 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టినట్లు వివరించారు. రెండు కేంద్రాల్లో ఇప్పటి వరకు 640.129 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టామన్నారు.

➪ ప్రియదర్శిని జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం రాత్రి 8 గంటల సమయంలో 39 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. విద్యుదుత్పత్తి నిమిత్తం 32,917 క్యూసెక్కులు వినియోగించినట్లు వివరించారు. ఆవిరి రూపంలో 94 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 650, సమాంతర కాల్వకు 800, భీమా లిఫ్ట్-2కు 750 క్యూసెక్కులు వినియోగించినట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9,070 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

సుంకేసులకు కొనసాగుతున్న వరద..

సుంకేసుల జలాశయానికి బుధవారం ఎగువ నుంచి 34,432 క్యూసెక్కుల వరద రాగా..7 గేట్లను మీటర్ మేర తెరిచి 30,415 క్యూసెక్కులు దిగువకు, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ మహేంద్ర వివరించారు.

శ్రీశైలంలో 883.1 అడుగుల నీటిమట్టం..

శ్రీశైలం జలాశయంలో బుధవారం 883.1 అడుగుల నీటిమట్టం.. 205.2258 టీఎంసీల నీటి నిల్వ ఉందని అధికారులు వివరించారు. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 32,917 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 24,464 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుందన్నారు. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,744 క్యూసెక్కులు దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు చేరుతున్నట్లు వివరించారు. భూగర్భ కేంద్రంలో 16.942 మి.యూ., కుడిగట్టు కేంద్రంలో 15.221 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టారు.

ఆత్మహత్యాయత్నం ఘటనపై ఆర్డీఓ విచారణ



మిడ్జిల్: మండలంలోని వాడ్యాల్‌కు చెందిన రైతు గజ్జల జంగమ్మ, ఆమె కుమారుడు గజ్జల కృష్ణయ్య సోమవారం తహసీల్దార్ ఎదుట పురుగులమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటనపై బుధవారం మహబూబ్‌నగర్ ఆర్డీఓ నవీన్ కుమార్ బుధవారం గ్రామస్తుల సమక్షంలో సర్వేనెంబర్ 156 వద్ద విచారణ చేపట్టారు. తాత, ముత్తాతల కాలం నుంచి ఉద్దాల లెక్కన పంచుకున్నామని, మూడు, నాలుగు సర్వే నంబర్లలో ఒక్కొక్కరికి ఒకటి, మూడు, నాలుగు గుంటల భూమి ఉండడంతో అప్పట్లో సాగు చేయడం ఇబ్బందిగా ఉంటుందని ముగ్గురు ముత్తాతలు మూడుచోట్ల పంచుకున్నారని, ఎవరి భూమిపై వారు మోఖాపై ఉన్నారని గ్రామస్తులు ఆర్డీఓకు వివరించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ.. సమస్యను అందరు కూర్చొని మాట్లాడుకోవాలని సూచించారు. అలాగే రైతు జంగమ్మ కుమారుడు కృష్ణయ్య తాను ఈ విషయంలో తొందరపడ్డానని.. తనదే తప్పని తహసీల్దార్ యూపీరాజుకు లిఖిత పూర్వకంగా రాసిచ్చారు. ఆర్డీఓ వెంట రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.